
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
సోమవారం ; 24 ; ఫిబ్రవరి ; 2025



సోమశిలలో 60.522 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో ఆదివారం 60.522 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పైతట్టు ప్రాంతాల నుంచి 1058 క్యూసెక్కుల వరద వచ్చి చేరుతోంది.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10 గ్రా)	రూ.89,010
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1 గ్రా)	రూ.8,045
3 శాతం జీఎస్టీతో	రూ.8,286
నవర (8 గ్రా)	రూ.66,288

గరిష్టం/కనిష్టం
35.3 /23.9

వాతావరణం

జిల్లాలో వాతావరణం సోమవారం పొడిగానే ఉంటుందని ఆ శాఖ అధికారులు తెలిపారు. గాలిలో తేమ ఆదివారం 60 శాతంగా నమోదైంది.

న్యూస్‌రీల్

అగ్రిగోల్డ్ అసోసియేషన్ ర్యాలీ నేడు

నెల్లూరు(వీఆర్సీసెంటర్): నగరంలో ర్యాలీని సోమవారం ఉదయం నిర్వహించనున్నామని అగ్రిగోల్డ్ ఏజెంట్స్, కస్టమర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా కమిటీ కార్యదర్శి ఉప్పలపాటి రామదాసు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. గాంధీబొమ్మ సెంటర్ నుంచి ప్రదర్శనగా బయల్దేరి కలెక్టరేట్, ఎస్పీ కార్యాలయాల వద్ద ధర్నాను చేపట్టనున్నామని చెప్పారు. అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి ముప్పాళ్ల నాగేశ్వరరావు, సీపీఐ జిల్లా కార్యదర్శి దామా అంకయ్య, అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తిరుపతిరావు హాజరుకానున్నారని చెప్పారు. అగ్రిగోల్డ్ బాధితులు తరలిరావాలని కోరారు.

సస్పెన్షన్లో ఉన్నా.. ఎంచక్కా విధుల్లోనే!

- విజమూరులో ఇదీ ఉపాధి సిబ్బంది తీరు
- ఏపీఓకు వారిపై ఇంత ప్రేమ ఎందుకో?



కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న టీఏ మహేష్

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలో సస్పెండ్ అయిన ఉపాధి హామీ పథకం ఉద్యోగులు ఎంచక్కా విధులు నిర్వహిస్తున్నారు. దర్జాగా కార్యాలయంలో తమకు కేటాయించిన కుర్చీల్లో కుర్చొని పనులు చేస్తున్నా ఏపీఓకు మాత్రం కనిపించడం లేదట. వివరాల్లోకి వెళితే.. మండలంలో ఏడాది కాలంలో జరిగిన జాతీయ ఉపాధి హామీ పనులకు సంబంధించి గత నెలలో సోషల్ ఆడిట్ జరిగింది. డ్వామా పీడీ గంగా భవాని ఆధ్వర్యంలో సామాజిక తనిఖీ ప్రజా వేదిక నిర్వహించారు. ఇందులో ఈసీ ఓ.రామ్మోహన్, టీఏలు సునీల్, మహేష్, సీఓ మాల్యాద్రిలు అవినీతికి పాల్పడినట్లు నిర్ధారించారు. వీరిపై చర్యల నిమిత్తం కలెక్టర్‌కు నివేదిక పంపారు. ఈ నెల 19న వీరిని విధులు నుంచి తొలగిస్తూ కలెక్టర్ జారీ చేసిన ఉత్తర్వులు కార్యాలయానికి వచ్చాయి. 21న సీఓ మినహా మిగితా వారు రిసీవ్ కాపీ తీసుకున్నారు. ఈ ఉత్తర్వుల్లో ఈసీకి రూ.3.15 లక్షలు, టీఏ సునీల్‌కు రూ.9.25 లక్షలు, టీఏ మహేష్‌కు రూ.3.25 లక్షలు, సీఓ మాల్యాద్రికి రూ1.25 లక్షలు రికవరీకి ఆదేశిస్తూ విధుల నుంచి తొలిగించారు. అయితే వారు జనవరి 18వ తేదీ నుంచి విధుల్లో ఉంటూ అన్ని పనులు చేస్తున్నారు. ఈ విషయమై అధికారులను అడిగితే సస్పెండ్ ఉత్తర్వులు వచ్చే వరకు విధులు నిర్వహించవచ్చని తెలిపారు. కానీ సస్పెండ్ ఆర్డర్స్ వచ్చిన తరువాత కూడా ఇప్పటికీ వారి చేత పనులు చేయించుకుంటున్నారు. వారే ఎంబుక్ రికార్డు చేస్తున్నారు. ఈసీ చెక్ మెజర్స్ చేస్తున్నారు. ఏపీఓకు వీరిపై ఇంత ప్రేమ ఎందుకో ఆయనకే తెలియాలి.

రగులుతున్న అంతర్గత సెగలు

- ఉదయగిరి టీడీపీలో కాకర్ల, బొల్లినేని వర్గీయుల మధ్య విభేదాలు
- ఎమ్మెల్యే తమకు అన్యాయం చేస్తున్నారంటూ బొల్లినేని వద్ద అనుచరుల ఆవేదన
- కాకర్లపై పార్టీ అధినేతకు బొల్లినేని ఫిర్యాదు
- లోకేశ్ అండతో డోంట్‌కేర్ అంటున్న ఎమ్మెల్యే





ఎమ్మెల్యే తమను పట్టించుకోవడం లేదంటూ వింజమూరులో బొల్లినేని వద్ద ఆవేదన వ్యక్తం చేస్తున్న ఓ నేత

ఉదయగిరి: ఉదయగిరి టీడీపీలో తమ్ముళ్ల మధ్య విభేదాలు బుసలు కొడుతున్నాయి. ఎమ్మెల్యే కాకర్ల సురేష్, మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు వర్గాన్ని పూర్తిగా పక్కనపెట్టే ప్రక్రియకు పదును పెట్టారు. భవిష్యత్తులో బొల్లినేని వర్గీయులు రాజకీయంగా తనను దెబ్బకొట్టే అవకాశం ఉన్నందున వారిని ఇప్పటి నుంచే పార్టీ పరంగా ప్రాధాన్యత తగ్గిస్తున్నారు. పార్టీ జాతీయ ఉపాధ్యక్ష హోదాలో ఉన్న బొల్లినేని నియోజకవర్గ పర్యటనకు వచ్చినపుడు ఆయనతో అనుచరులు పలువురు ఇదే విషయమై తమ ఆవేదన వెళ్లగక్కుతున్నారు. పార్టీ కోసం తాము చేసిన సేవలను సైతం మరిచిపోయి కేవలం మీ అనుచరులమనే ముద్రవేసి పక్కన పెట్టారంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బొల్లినేని శుక్రవారం వింజమూరుకు వచ్చిన నేపథ్యంలో స్థానిక పాతబస్టాండ్ వద్ద ఓ కార్యకర్త తీవ్ర స్వరంతో ఎమ్మెల్యే తమకు అన్యాయం చేస్తున్నారంటూ ఆవేదన వెలిబుచ్చారు. అంతకుముందు కొండాపురం మండల నేతలు ఓ వివాహ కార్యక్రమం సందర్భంగా బొల్లినేనితో సమావేశమై పార్టీలో తమకు జరుగుతున్న అన్యాయం గురించి ఆవేదన వ్యక్తం చేసి తాడోపేడో తేల్చుకోవాలని డిమాండ్ చేశారు.

సార్వత్రిక ఎన్నికల నుంచి వైరం

రెండేళ్ల క్రితం కాకర్ల ట్రస్టు పేరుతో నియోజకవర్గంలో సేవా కార్యక్రమాలు చేపట్టేందుకు కాకర్ల సురేష్, నారా లోకేశ్ అనుమతితో అమెరికా నుంచి ఉదయగిరికి మకాం మార్చారు. వింజమూరు కేంద్రంగా ట్రస్టు ద్వారా సేవా కార్యక్రమాలు చేపట్టి జనాల మధ్య ఉన్నారు. ఈ నేపథ్యంలో లోకేశ్ యువగళం పాదయాత్ర సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గంలో అప్పటి నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న బొల్లినేని కాకర్ల ట్రస్టు తరఫున బ్యానర్లు కూడా పెట్టనివ్వలేదు. అంతేకాకుండా నా నియోజకవర్గంలో కాకర్ల ఉనికి ఉండటానికి లేదు. అతన్ని కలవటానికి కూడా వీలు లేదని బొల్లినేని చినబాబుకు తెగేసి చెప్పారు. అయినా కాకర్ల సురేష్ కొండాపురం మండలంలో తమ ట్రస్టు తరఫున రూ.లక్షలు ఖర్చు చేసి లోకేశ్‌కు స్వాగత బ్యానర్లు ఏర్పాటు చేశారు. దీంతో రగిలిపోయిన బొల్లినేని తమ వర్గీయులు ద్వారా బ్యానర్లు తొలగించారు. కాకర్ల ట్రస్టులో పనిచేసే ఆయన అనుచరులను చితకబాది జలదంకి పోలీస్‌స్టేషన్‌లో పెట్టించారు. ఈ విషయం లోకేశ్ దృష్టికి వెళ్లడంతో కాకర్లను ఓపికగా ఉండాలి అని సముదాయించారట. పక్క నియోజకవర్గం కందుకూరుకు కాకర్ల సురేష్‌ను పిలిపించుకొని మాట్లాడారు. దీంతో తీవ్ర ఆగ్రహం చెందిన బొల్లినేని తమ అనుచరుల వద్ద లోకేశ్‌ను కించపరుస్తూ మాట్లాడారు. ఈ విషయం లోకేశ్ దృష్టికి వెళ్లింది. అప్పటి నుంచీ బొల్లినేనికి చెక్ పెట్టేందుకు చినబాబు పావులు కదిపారు. సురేష్‌కు ఉదయగిరి టికెట్‌కు గ్రీన్ సిగ్నల్ ఇచ్చి రహస్యంగా ఉంచారు. తమను కాదని చంద్రబాబు వేరేవారికి టికెట్టు ఇవ్వరనే ధీమాతో ఉన్న బొల్లినేనికి చినబాబు షాక్ ఇస్తూ కాకర్లకు టికెట్టు ఖరారు చేశారు. దీంతో బొల్లినేని అనుచరులు కాకర్లను ఓడిస్తామని హెచ్చరించి అధిష్టానంపై ఒత్తిడి పెంచారు. చంద్రబాబు బొల్లినేనికి అనుకూలంగా ఉన్నప్పటికీ లోకేశ్ కాకర్లను మార్చేందుకు ససేమీరా అన్నారు. చంద్రబాబు ఏమీ చేయలేక జాతీయ ఉపాధ్యక్ష పదవి ఇచ్చి బుజ్జగించారు. బొల్లినేని ఎన్నికల సమయంలో కాకర్లను ఓడించేందుకు పావులు కదిపినా సురేష్ మాత్రం విజయం సాధించారు.

సీన్ తారుమారు

కాకర్ల సురేష్ ఎమ్మెల్యేగా గెలవడంతో బొల్లినేని అనుచరుల్లో గుబులు ప్రారంభమైంది. అప్పటికే మండల టీడీపీ కన్వీనర్లు అందరూ బొల్లినేని వర్గీయులు కావడంతో వారికి చెక్ పెట్టే క్రమంలో కొందరిని ఎమ్మెల్యే దూరంగా పెట్టారు. ఈ క్రమంలో మిగతా వారు బొల్లినేనికి వ్యతిరేకంగా మాట్లాడుతూ ఎమ్మెల్యేకు దగ్గరయ్యే ప్రయత్నం చేశారు. ఈ వ్యవహారంలో కొంతమంది విజయం సాధించారు. అయితే వీరు అవకాశం దొరికితే ఎప్పుడైనా తనను దెబ్బకొట్టే అవకాశం ఉన్నదని ఎమ్మెల్యే అనుమానిస్తూనే ఉన్నారని అంటున్నారు. ఈ క్రమంలో త్వరలో వారిని కూడా పక్కన పెట్టి తన సొంత టీమ్‌ను సిద్ధం చేసుకోవాలనే యోచనలో ఉన్నారని సమాచారం. తన బలం పెంచుకునేందుకు ప్రతిపక్ష పార్టీలో బలమైన క్యాడర్‌ను టీడీపీలో చేర్చుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తమ్మీద నియోజకవర్గంలో బొల్లినేని పేరు కనుమరుగు చేసేందుకు అన్ని అవకాశాలను ఎమ్మెల్యే సద్వినియోగం చేసుకుంటున్నారు. బ్యానర్లలో ఎక్కడా బొల్లినేని ఫొటో ఉండటానికి వీల్లేదని స్పష్టం చేశారట. బొల్లినేనితో అంటకాగి గత ఎన్నికల్లో తమను ఇబ్బంది పెట్టిన వారిని పూర్తిగా పక్కన పెట్టారు. దీంతో పార్టీలో అంతర్గత విభేదాలు తమ్ముళ్ల మధ్య సెగలు రగిలిస్తున్నాయి. ఎమ్మెల్యే తీరుపై బొల్లినేని చంద్రబాబు వద్ద ప్రస్తావించినట్లు సమాచారం. అయినా ఎమ్మెల్యేకు లోకేశ్ అనుగ్రహం ఉండటంతో డోంట్ కేర్ అనే రీతిలో వ్యవహరిస్తున్నారు. భవిష్యత్‌లో ఈ పరిణామాలు ఎటు దారితీస్తాయో అనే ఆందోళన ఆ పార్టీ క్యాడర్‌లో ఉంది.



కొండాపురం మండలంలో ఇటీవల తన అనుచరులతో సమావేశం అయిన బొల్లినేని రామారావు

ప్రశాంతంగా గ్రూప్-2 మెయిన్స్



నెల్లూరు వైఎంసీఏ గ్రౌండ్‌లోని పీజీ కాలేజీలో పరీక్ష కేంద్రానికి వెళ్తున్న అభ్యర్థులను తనిఖీ చేస్తున్న పోలీసులు

- 4,102 మందికి గానూ ఉదయం 554 మంది గైర్హాజరు
- మధ్యాహ్నం సెషన్‌లో 556 మంది గైర్హాజరు



సమయం కావడంతో పరుగులు తీస్తున్న అభ్యర్థిని



నెల్లూరు వైఎంసీ గ్రౌండ్‌లోని పీజీ కాలేజీలో పరీక్ష కేంద్రానికి పోలీసుల సమక్షంలో తలుపులు వేస్తున్న అధికారి

నెల్లూరు(అర్బన్): చాలా కాలం తర్వాత నిర్వహించిన గ్రూప్-2 మెయిన్స్ పరీక్షలు జిల్లాలో ఆదివారం ప్రశాంతంగా జరిగాయి. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంకాలం 5 గంటల వరకు రెండు పేపర్లకు పరీక్షలు జరిగాయి. గంగవరంలోని గీతాంజలి ఇంజినీరింగ్ కళాశాల, వెంకటాచలంలోని క్యూబా ఇంజినీరింగ్ కళాశాల, నెల్లూరులోని నారాయణ ఇంజినీరింగ్ కళాశాల, నారాయణ ఇంగ్లిషు మీడియం హైస్కూలు, జగన్స్ డిగ్రీ కళాశాల, శ్రీచైతన్య జూనియర్ కళాశాల, వీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీజీ సెంటర్ తదితర 7 సెంటర్లలో పరీక్షలు జరిగాయి. దరఖాస్తు చేసుకున్న మొత్తం 4,102 మంది అభ్యర్థులకు పరీక్షలు రాసేందుకు ఏపీపీఎస్సీ అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. అయితే వీరిలో ఉదయం పూట జరిగిన పరీక్షకు 3548 మంది హాజరయ్యారు. 554 మంది గైర్హాజరయ్యారు. 86.5 శాతం మంది పరీక్షలు రాశారు. మధ్యాహ్నం సెషన్‌లో 3546 మంది పరీక్షలు రాయగా మిగతా 556 మంది గైర్హాజరయ్యారు. 86.4శాతం హాజరు నమోదయింది.

ఉరుకులు.. పరుగులు

గ్రూపు-2 పరీక్షలకు సంబంధించి అభ్యర్థులు పరీక్షలు ప్రారంభమైన చివరి నిముషంలో కొంతమంది ఉరుకులు, పరుగులతో హాజరయ్యారు. కొన్ని చోట్ల ఆలస్యంగా వచ్చారని కొంతమందిని అనుమతించలేదు. నందిపాడు గ్రామానికి చెందిన ఒక మహిళా అభ్యర్థి నెల్లూరులోని ఆమె పెద్దమ్మ ఇంటికి వచ్చింది. తర్వాత నారాయణ ఇంజినీరింగ్ కళాశాల వద్దకు వస్తూ గుర్తింపు కార్డు మరిచి పోయింది. హాల్ టికెట్‌తో పాటు ఏదో ఒక ప్రభుత్వ గుర్తింపు కార్డు తప్పని సరిగా తీసుకుని రావాల్సి ఉందని అలా గుర్తింపు కార్డు లేనందున పరీక్షా కేంద్రంలోనికి అనుమతించేది లేదని అధికారులు పేర్కొన్నారు. తాను ఏళ్ల తరబడి కష్టపడి పరీక్ష కోసం ప్రిపేర్ అయ్యానని తనను అనుమతించాలని వేడుకున్నా అధికారులు కనికరించలేదు. దీంతో ఆమె ఏడుస్తూ వెనుదిరిగింది.


- నగరంలోని వీఆర్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ పీజీ సెంటర్‌లో ఓ దివ్యాంగుడిని పోలీసులు చెక్‌చేశారు. బూట్లు విప్పి తనిఖీ చేశారు. అనంతరం పోలీసులే చేతుల మీదుగా పరీక్ష కేంద్రంలోనికి తీసుకెళ్లారు. పరీక్ష రాయడానికి వచ్చిన మరో అంధుడికి సహాయకునిగా మరో వ్యక్తిని అనుమతించారు. పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని ఎలాంటి లోటు పాట్లు జరగలేదని సబ్‌కలెక్టర్, గ్రూప్-2 పరీక్షల కోఆర్డినేటర్ టి.పూజ తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో ఏరులై పారుతున్న మద్యం

- బానిసలవుతున్న యువత
- జీవితాలపై తీవ్ర ప్రభావం
- మత్తులో నేరాలు
- అవగాహనతోనే నియంత్రణ

మద్యం మత్తు.. జీవితం చిత్తు

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత జిల్లాలో మద్యం ఏరులై పారుతోంది. పగలు, రాత్రి అనే తేడా లేకుండా అందుబాటులో ఉంది. మత్తు మనిషిని విచక్షణ కోల్పోయేలా చేస్తోంది. నిషాలో ఏం చేస్తున్నారో తెలియని స్థితిలో జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. కొందరు నేరాలకు పాల్పడుతుంటే మరికొందరు అనారోగ్యం పాలై, కుటుంబ సమస్యలతో అర్ధాంతరంగా ఆయువు తీసుకుంటుండగా, ఇంకొందరు రోడ్డు ప్రమాదాల్లో తనువు చాలిస్తున్నారు. మత్తులో అఘాయిత్యాలకూ వెనుకాడటం లేదు.



కొన్ని ఘటనలు

- తూకుమాన్ మిట్టలో మద్యం తాగుతున్న ఇద్దరు యువకులను ఓ వ్యక్తి వారించాడు. అప్పటికే తాగి ఉన్న యువకులు అతడిని అతి దారుణంగా హత్య చేశారు.
- నెల్లూరు నగరానికి చెందిన ఇద్దరు యువకులు మద్యం మత్తులో మోటార్‌బైక్ నడుపుతుండగా జీవీఆర్‌ఆర్ కళాశాల సమీపంలో ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఓ యువకుడి కాలు తెగిపోగా ఇంకొకరు తీవ్రంగా గాయపడ్డారు.
- నెల్లూరు నగరంలో మద్యం మత్తులో ఓ వ్యక్తి తన కుటుంబసభ్యులతో కలిసి యువకుడిని హత్య చేశాడు.
- మద్యం తాగేందుకు డబ్బులివ్వలేదని తాతపై మనుమడు దాడి చేశాడు. గాయాలపాలైన వృద్ధుడు చనిపోయాడు.
- మద్యం మత్తులో గొడవపడుతున్న వారిని వారించిన ఓ యువకుడిని కొందరు హత్య చేశారు.

నెల్లూరు(క్రైమ్): గత ప్రభుత్వ హయాంలో సర్కారు మద్యం దుకాణాలు ఉండేవి. నిర్ణీత వేళల్లోనే విక్రయాలు సాగేవి. అనధికార మద్యం విక్రయాలు జరగకుండా సెబ్ పటిష్ట చర్యలు తీసుకుంది. మత్తు పదార్థాల వినియోగంపై విద్యాసంస్థల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించింది. దీంతో నేరాలు గణనీయంగా తగ్గాయి. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ మద్యం దుకాణాలను తొలగించింది. సెబ్‌ను రద్దు చేసింది. మద్యం దుకాణాలను ప్రైవేట్ పరం చేసింది. దీంతో జిల్లాలో 200 మద్యం దుకాణాలు ఏర్పడ్డాయి. 50కు పైగా బార్ అండ్ రెస్టారెంట్లు న్నాయి. అధిక శాతం మద్యం దుకాణాలు కూటమి నేతలు, వారి అనుచరులవవి కావడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. బెల్టుషాపులు పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయి. సరదాగా అలవాటైన మందు మార్కెట్‌లో సులువుగా లభ్యమవుతుండటంతో యువత బానిసలుగా మారుతోంది. చదువుకోవాల్సిన వయస్సులో బాలలు మద్యం, మత్తు పదార్థాలకు ఆకర్షితులవుతూ జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మత్తులో వాహనాలు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారు. నేరాలకు పాల్పడుతున్నారు. దుకాణాల్లో మైనర్లకు మద్యం విక్రయించకూడదనే నిబంధన ఉన్నా ఇది ఎక్కడా అమలుకు నోచుకోవడం లేదు. ఎక్సైజ్ అధికారులు స్పందించి విచ్చలవిడి విక్రయాలను సైతం కట్టడి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొరవడిన పర్యవేక్షణ

పిల్లలపై తల్లిదండ్రుల పర్యవేక్షణ కొరవడుతుండటంతో వారు దారి తప్పుతున్నారు. పుట్టిన రోజులు, పరీక్షల్లో పాసయ్యామని, ఉద్యోగం వచ్చిందని ఇలా ప్రతి విషయంలో పార్టీల్లో సరదాగా మత్తుకు అలవాటుపడుతున్నారు. ఎంజాయ్ ముసుగులో చెడు వ్యసనాలకు బానిసలై విలువైన జీవితాలను నాశనం చేసుకుంటున్నారు. మత్తుకు బానిసలైన వారు తమ వ్యసనాలను తీర్చుకునేందుకు సరిపడా నగదు కోసం దోపిడీలు, దొంగతనాలకు పాల్పడుతున్నారు. మత్తులో అఘాయిత్యాలకు వెనుకాడటం లేదు. వివాహమై సంతానం ఉన్న వారు సైతం కుటుంబ బాధ్యతలను విస్మరించి మద్యం తాగుతూ ఆరోగ్యం చెడగొట్టుకుని, అప్పుల పాలై అర్ధాంతరంగా తనువు చాలించి అయిన వారిని అగాథంలోకి నెట్టేస్తున్నారు. పోలీసులకు వివిధ కేసులతోపాటుగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షల్లో పట్టుబడుతున్న వారిలో అధికశాతం మంది 18 నుంచి 25ఏళ్ల లోపు వారు ఉండటంతో ఆందోళన కలిగిస్తోంది. కొన్ని ఘటనల్లో బాలలు సైతం పట్టుబడుతున్నారు.

అవగాహన అవసరం

మద్యం, మత్తు పదార్థాల సేవనంతో సంభవించే దుష్పరిణామాలపై విద్యార్థి దశ నుంచే అవగాహన కల్పించాలి. మరోవైపు మద్యం, మత్తు పదార్థాలకు బానిసలైన వారిని సకాలంలో గుర్తించి కౌన్సెలింగ్ ఇప్పించడం ద్వారా ఫలితాలుంటాయని వైద్యులు పేర్కొంటున్నారు.

నూతన వధూవరులను ఆశీర్వదించిన సీఎం



వధూవరులతో సీఎం చంద్రబాబునాయుడు

నెల్లూరు సిటీ: టీడీపీ నాయకుడు బీద రవిచంద్ర కుమారుడు గోకుల్ రిష్వంత్ వివాహానికి హాజరయ్యేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆదివారం నెల్లూరు వచ్చారు. ఈ సందర్భంగా నెల్లూరు రూరల్ మండలం కనుపర్తిపాడు జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు మధ్యాహ్నం ఒంటిగంట 15 నిమిషాలకు హెలికాప్టర్‌లో చేరుకున్నారు. హెలిప్యాడ్ వద్ద మంత్రి పొంగూరు నారాయణ, ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, వక్ఫ్‌బోర్డు చైర్మన్ అబ్దుల్ అజీజ్, కందుకూరు ఎమ్మెల్యే నాగేశ్వరరావు, సూళ్లూరుపేట ఎమ్మెల్యే విజయశ్రీ, కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్ తదితరులు స్వాగతం పలికారు. అక్కడి నుంచి వీపీఆర్ కన్వెన్షన్‌కు వచ్చి నూతన వధూవరులు గోకుల్ రిష్వంత్, దివిజలను ఆశీర్వదించారు. తిరిగి 2.18 నిమిషాలకు హెలిప్యాడ్ నుంచి ఉండవల్లికి బయలుదేరి వెళ్లారు.

శేష వాహనంపై కల్యాణ వెంకటేశ్వరుడి విహారం

బుచ్చిరెడ్డిపాళెం: బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీలోని రామకృష్ణ నగర్‌లో వెలిసిన శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం ధ్వజారోహణ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి తిరుచ్చిసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. రాత్రి శ్రీదేవి భూదేవి సమేత శ్రీ కల్యాణ వెంకటేశ్వర స్వామి వైకుంఠ వేకనాథుని అవతారంలో గ్రామ పురవీధులలో శేషవాహనంపై విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు.

క్లుప్తంగా

ఐసీఏఐ నూతన కమిటీ నియామకం



బాధ్యతలు స్వీకరించిన ఐసీఏఐ ఎస్ఐఆర్సీ నూతన కమిటీ

వెంకటాచలం: ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ చార్టెడ్ అకౌంటెంట్స్ నెల్లూరు బ్రాంచ్ ఆఫ్ ఎస్ఐఆర్సీ (సదరన్ ఇండియా రీజినల్ కౌన్సిల్) నూతన కమిటీ ప్రమాణ స్వీకారం ఆదివారం వెంకటాచలం టోల్ప్లాజా వద్దనున్న ఐసీఏఐ భవన్లో జరిగింది. నూతన కమిటీ చైర్మన్గా ఎస్ హిమహాసిని, వైస్ చైర్మన్గా జి.ఉదయ్తేజ, సెక్రటరీగా సీహెచ్ వెంకట సందీప్, ట్రెజరర్గా ఎన్.మణికంఠ శ్రీనివాస్, ఎంసీ మెంబరుగా సాయిసేసి ప్రీతం, విద్యార్థి విభాగం చైర్మన్గా జి.సాయిచరణ్ నియమితులయ్యారు. ఐసీఏఐ వైస్ ప్రెసిడెంట్ ప్రసన్నకుమార్ సమక్షంలో నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించింది.

నిత్యాన్నదాన పథకానికి రూ.2 లక్షల విరాళం



నిత్యాన్నదాన పథకానికి బాలాజీస్వామికి నగదు అందిస్తున్న దాతలు

రాపూరు: మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం పెంచలకోనలోని శ్రీపెనుశిలలక్ష్మీ నరసింహ స్వామి నిత్యాన్నదాన పథకానికి ఇద్దరు దాతలు ఆదివారం రూ.2 లక్షలు విరాళం అందించినట్లు దేవస్థాన అధికారులు తెలిపారు. నాయుడుపేటకు చెందిన సిద్ధంశెట్టి నరసింహులు జ్ఞాపకార్థం కుమార్తె జనని, కుమారుడు రామ్చరణ్ రూ.లక్ష నగదును అర్చకులు బాలాజీస్వామికి అందించారు. అన్నమయ్య జిల్లా చిట్వేలికి చెందిన మోక్షిత, వేదాన్స్, పద్మ ఆన్లైన్ ద్వారా రూ.లక్ష అందించినట్లు వివరించారు. దాతలకు మూడు ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించి, వేదపండితుల ఆశీర్వాదవచనాలు, తీర్థ ప్రసాదాలు అందించారు.

గుర్తు తెలియని వ్యక్తి దుర్మరణం



గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

మనుబోలు: రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి (55) దుర్మరణం చెందాడు. ఈ ఘటన మనుబోలులోని వైఎస్సార్ కూడలి వద్ద ఆదివారం జరిగింది. మృతుడి వద్ద ఎలాంటి ఆధారాలు లభించలేదు. అతన్ని ఢీకొట్టిన వాహనం కారు అని కొందరు అంటున్నారు. అయితే ఆ వాహనం వివరాలు తెలియలేదు. మృతుడు యాచకుడు అయి ఉండొచ్చని భావిస్తున్నారు. ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్) : 93
లేయర్ (లైవ్) : 75
బ్రాయిలర్ చికెన్ : 170
బ్రాయిలర్ స్కిన్లెస్ : 190
లేయర్ చికెన్ : 127

నిమ్మధరలు

పొదలకూరు (కిలో)



పెద్దవి	: రూ.48
సన్నవి	: రూ.30
పండ్లు	: రూ.22

మూగజీవాలతో చీకటి వ్యాపారం



నగరంలోని మైపాడురోడ్డులో సంచరిస్తున్న ఆవుల మంద

▶▶ పశువుల మాంసం అక్రమ రవాణా

- సంతలో గుట్టుగా విక్రయాలు
- సరిహద్దులు దాటించి విదేశాలకు ఎగుమతి
- నిద్దరోతున్న నిఘా వ్యవస్థ

జిల్లాలో గొడ్డు మాంసంతో చీకటి వ్యాపారం జోరుగా జరుగుతోంది. ఇక్కడి నుంచి పశువులనే కాకుండా మాంసాన్ని యథేచ్ఛగా అక్రమ రవాణా చేస్తున్నారు. సంతల ముసుగులో గుట్టుగా వేలాది ఆవులు, గేదెలను కబేళాలకు తరలించి.. వధించి మాంసాన్ని విదేశాలకు ఎగుమతి చేసి సొమ్ము చేసుకుంటున్నారు. నిరోధించాల్సిన పలు ప్రభుత్వ శాఖల అధికారులు ముడుపుల మత్తులో మిన్నకుంటున్నారు. ఇటీవల నగరపాలక సంస్థ హెల్త్ విభాగాధికారుల ఆకస్మిక తనిఖీల్లో ఈ గుట్టు రట్టయింది.

నెల్లూరు (బారకాసు): జిల్లాలో పశువుల సంత ముసుగులో యథేచ్ఛగా పశువుల మాంసం రవాణా జరుగుతోంది. ఎవరికీ అనుమానం రాకుండా పశువులను వధించి వాటి మాంసాన్ని కంటైనర్లలో నెల్లూరు నగరం నుంచి గూడూరు, నాయుడుపేట, సూళ్లూరుపేట, తడ మీదుగా చెన్నై, కేరళ, కర్ణాటక రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాలకు తరలిస్తున్నారు. అక్కడ మాంసాన్ని ప్యాకింగ్ చేసి ఇతర దేశాలకు తరలిస్తున్నారు. కరువు కారణంతో 10 శాతం మూగజీవాల విక్రయాలు జరిగితే 90 శాతం భక్షించేందుకు వ్యాపారాలు చేస్తున్నారు.

వారానికి రెండు.. మూడు రోజులు

జిల్లాలోని పలు ప్రాంతాల్లో ప్రతి వారం జరిగే సంతలో పశువులను తక్కువ రేటుకు కొని వాటిని వధించి మాంసాన్ని చెన్నైకు తరలిస్తున్నారు. నగరంలోని బోడిగాడితోట, దీనదయాళ్ నగర్, పెన్నానది ప్రాంతాల నుంచి వారంలో రెండు, మూడు రోజులు రాత్రి వేళల్లో తరలిస్తూ చీకటి దందా కొనసాగిస్తున్నారు. వారానికి రూ.25 లక్షలు విలువ చేసే 20 టన్నుల గొడ్డు మాంసంను అక్రమ రవాణా చేస్తున్నారు. అంటే వారానికి దాదాపు 250 చొప్పున నెలకు 1000 పశువులను వధిస్తూ వాటి ద్వారా రూ.కోట్లలో సంపాదిస్తున్నారు. నెల్లూరు నగరంలోని చింతారెడ్డిపాలెం ప్రాంతం నుంచి జనవరి 11వ తేదీ పశువుల మాంసాన్ని అనుమతులు లేకుండా అక్రమంగా రవాణా చేసేందుకు సిద్ధంగా ఉన్న కంటైనర్ను పలువురి సమాచారం మేరకు పోలీసుల సహకారంతో నగర పాలక సంస్థ హెల్త్ విభాగాధికారులు పట్టుకున్నారు. అందులో సుమారు రూ.5 లక్షలు విలువ చేసే 4 టన్నుల పశు మాంసంను దొంతాలి యార్డుకు తరలించి నిర్వీర్యం చేశారు. అంటే దీన్ని బట్టి జిల్లా కేంద్రంగా ఏ స్థాయిలో పశు మాంసం విక్రయాలు జరుగుతున్నాయో అర్థమవుతోంది.

మామూళ్ల మత్తులో జోగుతున్న అధికారులు

జిల్లా పశువుల వధ, మాంసం విక్రయాలు, అక్రమ రవాణా అంతా కూడా సంబంధిత శాఖల అధికారుల కనుసన్నల్లోనే కొనసాగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొందరు ముఠాగా ఏర్పడి ఆయాశాఖల అధికారులకు ముడుపులిచ్చి పశువుల మాసాన్ని అక్రమంగా తరలించే వ్యాపారాన్ని కొనసాగిస్తున్నారు. చెక్పోస్టుల్లో సైతం వాహనాలను తనిఖీ చేయకుండా ముడుపులు ముట్టజెప్పుతుండడంతోనే ఈ వ్యాపారం గుట్టు బయటకు పొక్కడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. చెక్పోస్టుల్లో సైతం తనిఖీ చేయకుండా.. ప్రత్యేక కోడ్ను, స్టిక్కర్ను, పెయింటింగ్ను వాడుతున్నట్లు సమాచారం. డ్రైవర్కు మరొక కోడ్ ఉంటున్నట్లు తెలుస్తోంది.



అక్రమంగా తరలించేందుకు సిద్ధంగా ఉన్న పశు మాంసం కంటైనర్ను సీజ్ చేసిన అధికారులు (ఫైల్)

జంతు వధ నేరమైనప్పటికీ..

1960 జంతు పరిరక్షణ చట్టం ప్రకారం పశువులను వధించడం చట్టరీత్యా నేరం. అయినా జిల్లా కేంద్రంగా ఈ వ్యాపారం జోరుగా సాగుతోంది. జిల్లాలో ఉన్న పశు సంపదలో ఒట్టిపోయిన 10 శాతం పశువులతోపాటు పాలిచ్చే పశువులను సైతం నిర్దాక్షిణ్యంగా వధిస్తున్నారు. ఒట్టిపోయిన పశువులను రైతుల నుంచి రూ.5 వేలు, రూ.10 వేలకు దళారులు కొనుగోలు చేసి సంతలో రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకు పశువుల మాంసం విక్రయించే వారికి అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. పశువుల మాంసమే కాకుండా వాటి చర్మం, కొమ్ములు ఇలా అన్నీ ఉపయోగ పడుతాయి. చెప్పులు, వాయిద్య పరికరాలు, ఎరువుల తయారీలో వినియోగిస్తారు. దీంతో భారీ డిమాండ్ ఉంది.

చోద్యం చూస్తున్నారు

గొడ్డు మాంసం విక్రయాలు, రవాణా జరగకుండా చూడాల్సిన పశుసంవర్ధక, పోలీస్, మార్కెటింగ్ శాఖలు చోద్యం చూస్తున్నాయి. జిల్లాలో నెల్లూరుతో పాటు మనుబోలు, గూడూరు తదితర ప్రాంతాల్లో ఈ చీకటి వ్యాపారం జరుగుతున్నా.. మార్కెటింగ్ శాఖ అధికారులు పట్టించుకోరు. దారిలో రవాణా చేస్తున్నా.. పోలీసులు ఉదాసీనంగా వ్యవహరిస్తున్నారు. జిల్లా సరిహద్దుల్లో చెక్ పోస్టులున్నా.. ముడుపులిచ్చి కథ నడిపిస్తున్నారు. ఇకనైనా సంబంధిత అధికారులు పశువుల మాంసం అక్రమ రవాణా జరగకుండా తగు చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

గోమాంసం అక్రమ రవాణా అరికట్టాలి



వైద్యశాస్త్రంలో ఆవు మూత్రం, పాలలో అనేక ఔషధగుణాలు కలిగి ఉన్నాయి. అటువంటి గో సంపదను కాపాడుకోవాల్సిన అవసరం ఉంది. నేటి పాశ్చాత్య నాగరికతకు అలవాటు పడి గోమాంసం తినడం మా హక్కు అంటూ వితండ వాదాన్ని తీసుకు వస్తున్నారు. గోవధను నిషేధించడంతోపాటు పశువుల మాంసం అక్రమ రవాణాను అరికట్టేలా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలి.

– మిదతల రమేష్, బీజేపీ నేత

కఠిన చర్యలు తీసుకోవాలి



నెల్లూరు నుంచి పశువుల మాంసం అక్రమ రవాణా జరుగుతోంది. ఇతర జిల్లాల నుంచి కూడా నెల్లూరు మీదుగానే చెన్నైకు తరలిస్తుంటారు. పశువుల మాంసం అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేసే విధంగా అధికారులు కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది. అధికారులు అవినీతి మరిగి విచ్చలవిడి తనంతో వ్యవహరిస్తున్నారు. ఇది సమాజానికి ఎంతమాత్రం శ్రేయస్కరం కాదు.

– నరాల సుబ్బారెడ్డి, కాంట్రాక్టర్

ముడుపులతో అధికారుల మౌనం



నెల్లూరు నుంచి చెన్నైకు పశువుల మాంసాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. ప్రధానంగా గోవులను వధిస్తూ వాటి మాంసాన్ని తరలించడం నేరమని తెలిసినా కొందరు ముఠాగా ఏర్పడి ఇటువంటి అక్రమ రవాణాతో చీకటి వ్యాపారం చేసుకుంటూ రూ. లక్షలు సంపాదిస్తున్నారు. ఇదంతా సంబంధిత అధికారులకు తెలిసినా కూడా ముడుపులు అందుకుని మిన్నకుండిపోతున్నారు.

– నీలిశెట్టి లక్ష్మణరావు, ఆడిటర్

భూ సేకరణపై రైతుల తిరుగుబాటు

- కరేడులో మానవహారంతో నిరసన

ఉలవపాడు: బీపీసీఎల్, సోలార్ కంపెనీలకు తమ భూములు ఇవ్వమంటూ మండలంలోని కరేడు గ్రామ రైతులు ప్రభుత్వంపై తిరుగుబాటు ప్రకటించారు. ప్రభుత్వం ఏకపక్షంగా భూసేకరణకు తీర ప్రాంత గ్రామాల్లో మార్కింగ్ వేయడాన్ని నిరసిస్తూ బస్టాండ్ సెంటర్లో ఆదివారం రైతులు మానవహారంగా ఏర్పడి ఆందోళన వ్యక్తం చేశారు. రైతులు మాట్లాడుతూ మచిలీపట్నం వద్ద ప్రజలు వ్యతిరేకిస్తే వాటిని ఇక్కడ ఏర్పాటు చేసేందుకు సిద్ధపడుతున్నారని ఆరోపించారు. ఈ ప్రాజెక్టులు వస్తే ఇక్కడ గ్రామాలను ఖాళీ చేయించాల్సి వస్తుందన్నారు. ప్రభుత్వం తమ భూములు తీసుకుని పెద్ద పెద్ద కంపెనీలకు అప్పగిస్తే తమ పరిస్థితి ఏంటని ప్రశ్నించారు. గ్రామాల్లోని మనుషులతో పాటు మూగజీవాలు కూడా లేకుండా చేయడమే అన్నారు. ఈ విషయంలో ప్రభుత్వంతో ఎందాకైనా తీవ్రంగా ప్రతిఘటిస్తామన్నారు. ప్రజల పక్షాన ఏ రాజకీయ పార్టీ వచ్చి మద్దతు ఇచ్చినా వారిని స్వాగతిస్తామన్నారు.



కరేడులో మానవహారంగా ఏర్పడి నిరసన తెలుపుతున్న రైతులు

రాజకీయ నాయకులు తమ స్వలాభం కోసం తమ పట్టా భూములతో వ్యాపారం చేస్తున్నారని మండిపడ్డారు. కార్యక్రమంలో 139 కులాల జేఏసీ చైర్మన్ మిరియం శ్రీనివాసులు, మాజీ సర్పంచ్ సుబ్బారావు, సుబ్బారెడ్డి, బ్రహ్మారెడ్డి, భుజంగరావు, కోటేశ్వరరావు, వెంకటరెడ్డి, రాజశేఖరరెడ్డి, జయరామిరెడ్డి, కృష్ణయ్య, పెదవెంకటరావు, కొమరగిరి శ్రీను, చిలకా మాలకొండయ్య తదితరులు పాల్గొన్నారు.

పొగాకు బ్యారెన్ దగ్ధం

- రూ.5 లక్షల ఆస్తి నష్టం

మర్రిపాడు: మండలంలోని నందవరంలో ఆదివారం ఓ పొగాకు బ్యారెన్ దగ్ధమైంది. గ్రామానికి చెందిన యర్రమళ్ల సుబ్బరాయుడుకు చెందిన బ్యారెన్లో సాయంత్రం 5.30 గంటల సమయంలో క్యూరింగ్ కోసం ఏర్పాటు చేసిన పొగాకు కర్రలు జారిపడిపోవడంతో ప్రమాదం జరిగింది. అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించినప్పటికీ రాత్రి 7.30 గంటలకు కూడా అగ్నిమాపక శకటం ఘటనా స్థలానికి రాలేదు. సీఎం పర్యటన నేపథ్యంలో ఇక్కడి అగ్నిమాపక శకటాన్ని నెల్లూరుకు తరలించినట్లు సమాచారం. మంటలను అదుపులోకి తెచ్చేందుకు ఎంత ప్రయత్నం చేసినప్పటికీ ప్రయోజనం లేక పూర్తిగా బ్యారెన్ దగ్ధమైంది. ఈ ప్రమాదంలో సుమారు రూ.5 లక్షల మేర నష్టం వాటిల్లింది.



దగ్ధమవుతున్న పొగాకు బ్యారెన్

వెయ్యేళ్ల నాటి ప్రాచీన గ్రామం సిద్ధనకొండూరు

- 800 ఏళ్ల నాటి మనుమగండ గోపాలుని శిలాశాసనం పరిశీలన

కలిగిరి: మండలంలోని సిద్ధనకొండూరు గ్రామం వెయ్యేళ్ల క్రితమే వర్ధిల్లినట్లు ప్రముఖ చరిత్రకారుడు రసూల్బాబు తెలిపారు. సిద్ధనకొండూరులోని సిద్ధేశ్వరుడి కొండపై ఉన్న శిలాశాసనాన్ని భారతీయ పురావస్తు శాఖ చెన్నై శాసన విభాగ అధిపతి ఎం ఏసుబాబు, ప్రముఖ చరిత్రకారుడు రసూల్బాబు ఆదివారం పరిశీలించారు. సిద్ధేశ్వరాలయం పరిసర ప్రాంతాలను సందర్శించారు. సుమారు 800 ఏళ్ల నాటి మనుమగొండ గోపాలుని వెల్లడించిన 5 అడుగుల శిలాశాసనం స్తంభాన్ని పరిశీలించారు. వారు మాట్లాడుతూ ఈ శిలాశాసనం 13వ శతాబ్దానికి చెందిన మనుమసిద్ధి కుమారుడు మనుమగండ గోపాలుని కాలానికి చెందిందన్నారు. క్రీస్తు శకం 1290 ప్రాంతంలో సిద్ధనకొండూరు ప్రాంతాన్ని పాలించిన నూంకి నాయకుడి కుమారుడు సిద్ధప్పనాయుడు శాసనంను జారీ చేశారన్నారు. ఈ శాసనంలో సిద్ధేశ్వరుడికి చెరువు మాన్యాన్ని దానంగా ఇచ్చినట్లు రాసి ఉందన్నారు. తెలుగు, కన్నడ లిపి నుంచి పూర్తి తెలుగు లిపిగా మార్పు చెందే దశను ఈ శాసనంలో చూడొచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత, విశ్రాంత ఉపాధ్యాయుడు నందనవనం ప్రభాకర్రావు, ఆలయ ధర్మకర్త రూపిశెట్టి రామభద్రరావు, పాలిశెట్టి లక్ష్మీకాంతరావు, శివశంకర్, శ్రీకాంత్, మాధవరావు, మల్లిక్, తదితరులు పాల్గొన్నారు.



శిలాశాసనాన్ని పరిశీలిస్తున్న చరిత్రకారులు

నేలటూరు దళితవాడ తరలింపు ఖాయం

ముత్తుకూరు: థర్మల్ ప్రాజెక్టుల కాలుష్యంలో చిక్కుకొన్న నేలటూరు దళితవాడను తరలించి పునరావాసం కల్పించే ప్రక్రియను అధికారులు మళ్లీ ప్రారంభించారు. నేలటూరు గ్రామానికి, పట్టపుపాళెంకు ఇప్పటికే నెల్లూరురూరల్ మండలంలో పునరావాసం కల్పిస్తున్న విషయం తెలిసిందే. దళితవాడలో సుమారు 270 కుటుంబాలున్నాయి. ఈ గ్రామానికి అవసరమైన పునరావాసం కల్పించేందుకు అనువైన భూములు గతంలో లభించలేదు. తాజాగా ముత్తుకూరు మండలంలోని జంగాలకండ్రిగ వద్ద ఉన్న భూములను ఆర్డీఓ నాగఅనూష, రెవెన్యూ అధికారులు, గ్రామపెద్దలు పరిశీలించారు. ఈ భూముల సేకరణకు ఎదురయ్యే పరిస్థితులను సమీక్షిస్తున్న రెవెన్యూ అధికారులు ఆదివారం తెలిపారు.



భూములు పరిశీలిస్తున్న ఆర్డీఓ నాగఅనూష

గ్రావెల్ తవ్వకాలను అడ్డుకున్న గ్రామస్తులు

- రెండు టిప్పర్లు, జేసీబీ పోలీసులకు అప్పగింత

బిట్రగుంట: బోగోలు మండలం కడనూతలలో అక్రమంగా సాగుతున్న గ్రావెల్ తవ్వకాలపై గ్రామస్తులు కన్నెర్ర చేశారు. నెల రోజులగా కడనూతల చెరువుతోపాటు మేతపోరంబోకు, అటవీ భూముల్లో భారీ ఎత్తున గ్రావెల్ అక్రమ తవ్వకాలు సాగుతున్నాయి. రెవెన్యూ, ఇరిగేషన్, అటవీశాఖ అధికారుల కళ్లెదుటే ప్రభుత్వ భూముల్లో గ్రావెల్ తవ్వకాలు జరుగుతున్నా.. ఒక్క అధికారి కూడా పట్టించుకోలేదు. ఎమ్మెల్యే ప్రైవేట్ పీఏ ఒకరు సిఫారసు చేయడంతో అక్రమ తవ్వకాలపై అధికారులు మౌనం వహించారు. ఇటీవల తవ్వకాలు మరింత జోరుగా సాగుతుండడంతో గ్రామస్తులే రంగంలోకి దిగారు. శనివారం అర్ధరాత్రి సమయంలో అక్రమంగా గ్రావెల్ తరలిస్తున్న రెండు టిప్పర్లను, ఒక జేసీబీని స్వాధీనం చేసుకుని బిట్రగుంట పోలీసులకు సమాచారం అందించి స్టేషన్కు తరలించారు.



గ్రావెల్ తవ్వకాలు అడ్డుకుని పోలీస్స్టేషన్కు తరలించిన టిప్పర్లు

కండలేరులో 52.386 టీఎంసీల నిల్వ

రాపూరు: కండలేరు జలాశయంలో ఆదివారం నాటికి 52.396 టీఎంసీ నీరు నిల్వ ఉన్నట్లు జలాశయం ఈఈ విజయకుమార్రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయిగంగ కాలువకు 620, పిన్నేరు కాలువకు 120, లోలెవల్ కాలువకు 210, హైలెవల్ కాలువకు 190, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

